ప్లాస్టిక్ సర్జరీకి ఆధునిక హంగులు

రాయలసీమ జిల్లాలకు తలమానికమైన పెద్దాస్పత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ఆధునిక హంగులు సమకూరనున్నాయి. కాలిన గాయాలకు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఒక్కోసారి ప్లాస్టిక్ సర్జరీ అత్యవసరమవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రూ.2.64 కోట్లతో ఆధునిక భవన నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అధికారుల పర్యవేక్షణలో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో భవనం అందుబాటులోకి వచ్చి రోగులకు సేవలందించనున్నారు. – **కర్నూలు(హాస్పిటల్)**


నూతనంగా నిర్మిస్తున్న భవనం

- రూ.2.64 కోట్లతో ఆధునిక భవనం
- మరో రెండు నెలల్లో నిర్మాణం పూర్తి
- వైద్యులు, సిబ్బంది మంజూరు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి ప్రతి సోమ, గురువారాల్లో ఓపీ సేవలు ఉంటాయి. ఓపీ రోజున 45 నుంచి 50 మంది, సగటున నెలకు 350 మంది చికిత్స నిమిత్తం వస్తున్నారు. ఇలా వచ్చిన వారిలో అవసరమైన వారికి మంగళ, శుక్రవారాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఇలా ఏటా 500 నుంచి 700 వరకు శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. గతంలో ఈ విభాగానికి ఒక్కరే వైద్యులుండే వారు. ఇప్పుడు ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు పీజీ సీట్లు కూడా అందుబాటులోకి రావడంతో వైద్యసేవలు విస్తరించాయి. ముఖ్యంగా ఈ విభాగంలో గ్రహణమొర్రి, చిన్నారులకు పుట్టుకతో వచ్చే లోపాలు, రీకన్స్ట్రక్టివ్ సర్జరీ (ప్రమాదాల్లో ఎముకలు విరిగిన తర్వాత అయ్యే గాయాలు), హ్యాండ్ సర్జరీలు(చేతిలో నరాలు, కండరాలు, ఎముకలు తెగిపోయినా సరిచేయడం), కాలిన గాయాలు, మచ్చలు, వైకల్యం, కాస్మొటిక్ సర్జరీలు(ముక్కు, బుగ్గలు, పెదాలు, కంటి రెప్పలు, చెవులపై ఉన్న లోపాలను తొలగించడం), ఫేస్‌లిఫ్ట్ సర్జరీ, స్తనాలు(బ్రెస్ట్) సర్జరీలు, పొట్టజారిపోయిన వారికి చేసే ఆపరేషన్లు, అధిక బరువును తగ్గించే లైపో సక్షన్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

కాలిన గాయాలైన వారికి..

ఈ ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో కాలిన రోగులకు ప్రత్యేకంగా చికిత్స అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వార్డు కూడా ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ సర్జరీ సేవలకు, కాలిన రోగులకు విడివిడిగా విభాగాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో నూతన భవన నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో కాలిన రోగుల వార్డును పేయింగ్ బ్లాక్‌కు మార్చారు. ఇక్కడ కొన్ని గదులను తీసుకుని అందులోనే రోగులను ఉంచి వైద్యం అందిస్తున్నారు. శుశ్రుతభవన్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని కొనసాగిస్తున్నారు. అదే భవనంలోని డి–ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.

గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో..

నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రీవెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.6.7 కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.64 కోట్లను భవనం కోసం ఇచ్చింది. అయితే రెండేళ్లైనా గత తెలుగుదేశం ప్రభుత్వం పనులు ప్రారంభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోగుల ఇబ్బందులను గుర్తించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ మేరకు ఏడాది క్రితం పనులు ప్రారంభమయ్యాయి. ఆసుపత్రిలోని లెప్రసీ విభాగం పక్కన నూతన భవన నిర్మాణం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. మరో రెండు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి అవుతుందని అధికారులు చెబుతున్నారు.

రోగుల ఇబ్బందులు తీరేలా..

ఎన్‌పీపీడీబీఐ ప్రోగ్రామ్ కింద ప్రత్యేకంగా కాలిన రోగుల కోసం నూతన భవనం, మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయి. ఈ మేరకు భవనంలో రెండు వెంటిలేటర్లు, నాలుగు వైటల్ పారామీటర్ మానిటర్స్, డెర్మాటోమ్, రెండు స్కిన్ గ్రాఫ్ట్ మెషర్, రెండు పోర్టబుల్ లైట్స్, ఐదు హంబీస్ నైఫ్ మంజూరయ్యాయి. దీంతో పాటు 37 మంది వైద్యులు, సిబ్బంది కూడా ఈ విభాగానికి మంజూరయ్యాయి. ఇందులో ఒక ప్లాస్టిక్ సర్జన్/బర్న్స్/జనరల్ సర్జన్, ఇద్దరు అనెస్తెటిస్ట్స్, నలుగురు మెడికల్ ఆఫీసర్స్, 12 మంది స్టాఫ్‌నర్సులు, ఒక ఓటీ టెక్నీషియన్, ఇద్దరు డ్రెస్సర్స్, ఇద్దరు మల్టీపర్పస్ రిహాబిటేషన్/సీబీఆర్ వర్కర్స్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 12 మంది మల్టీపర్పస్ వర్కర్స్(నర్సింగ్ ఆర్డర్లీ/నర్సింగ్ అటెండెంట్స్/సఫాయి కర్మచారి)లు ఉన్నారు. తద్వారా రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. త్వరలో కాలిన రోగులకు ఇది ఒక రెఫరల్ సెంటర్‌గా విస్తృతమైన సేవలు అందించనుంది.

త్వరగా కోలుకునే అవకాశం



నూతన భవన నిర్మాణం పూర్తయితే రోగులకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. ఈ భవనం పూర్తయితే వసతులు, సౌకర్యాలు మెరుగవడంతో పాటు వైద్యులు, సిబ్బందిని అదనంగా నియమిస్తారు. దీనివల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంది. కాగా నూతన భవనంపై మరో అంతస్తు నిర్మిస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించే అవకాశం ఉంది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటే రోగులకు మేలు జరుగుతుంది.
– డాక్టర్ మంజులబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ, జీజీహెచ్, కర్నూలు

రెండు నెలల్లో నిర్మాణం పూర్తి



ఎన్‌పీపీడీబీఐ కింద మంజూరైన నూతన భవన నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ భవనం దాదాపుగా పూర్తి కావచ్చింది. మరో రెండు నెలల్లో రోగులకు అందుబాటులోకి రానుంది. అవసరమైన వసతులు, సౌకర్యాలు కూడా యుద్ధప్రాతిపదికన ఏర్పాటవుతాయి.
– రాజగోపాల్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీఎంఎస్ఐడీసీ, కర్నూలు

క్లుప్తంగా

వైద్య విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): వైద్యవిద్యా బోధనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ చెప్పారు. గురువారం ఆయన కళాశాలలోని కౌన్సిల్ హాల్‌లో ఆయా విభాగాల హెచ్ఓడీలతో సమావేశమయ్యారు. వైద్య విద్యాబోధనకు సంబంధించి ఆయా విభాగాలకు అవసరమైన వసతులు, సౌకర్యాలు, జర్నల్స్, పరికరాల కోసం ఇండెంట్ పెట్టాలన్నారు. డీఎంఈ ఆదేశాల మేరకు కళాశాల అభివృద్ధి సొసైటీలో ఉన్న రూ.4 కోట్లకు పైగా నిధులను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో ఎంబీబీఎస్ విద్యార్థులతో పాటు హౌస్ సర్జన్లు, పీజీలకు మెరుగైన బోధన అందించాలన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాళ్లు, డాక్టర్ వెంకటరంగారెడ్డి, డాక్టర్ చిట్టి నరసమ్మ, డాక్టర్ రేణుకా దేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్ పాల్గొన్నారు.

సీ.క్యాంపు రైతు బజారుకు నేడు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని సీ.క్యాంపు రైతుబజారుకు శుక్రవారం ఒక్క రోజు సెలవు ప్రకటించినట్లు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు. రైతుబజారులో పరిశుభ్రత పనులు చేపట్టేందుకు రైతుబజారును మూసి వేస్తున్నామన్నారు. రైతులు, వినియోగదారులు గుర్తించాలని, 25 వ తేదీ నుంచి యథావిధిగా రైతు బజార్ పనిచేస్తుందన్నారు.

ఆసుపత్రికి కుళాయిలు విరాళం


కుళాయిలను విరాళంగా అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయిరామ్

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని బాత్‌రూమ్‌ల్లో ఉపయోగించేందుకు ఆసుపత్రి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయిరామ్ వంద కుళాయిలను గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాయిరామ్ తన కుమారుడు దశరథ సాయి వరుణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆస్పత్రికి కుళాయిలను విరాళం ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు అవకాశాలు మెండు

కర్నూలు (టౌన్): మహిళలకు క్రీడల్లో అవకాశాలు మెండుగా ఉన్నాయని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మహిళలకు 400 మీటర్ల పరుగు, నడక పోటీలు, లెమన్ స్పూన్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల క్రీడల్లో మహిళలకు పతకాలు సాధిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం శుభపరిణామమన్నారు. శుక్రవారం వంటల, సాంస్కృతిక, స్కేటింగ్ పోటీలు ఉంటాయని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ


విజేతలకు కప్ అందజేస్తున్న విజయ మనోహరి

కర్నూలు (టౌన్): ఉగాది సందర్భంగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో వెంకటరమణ కాలనీలో నిర్వహించిన లైట్ టెన్నిస్ క్రికెట్ సూపర్–8 టోర్నీ గురువారం ముగిసింది. విన్నర్‌గా చరణ్, రన్నర్స్‌గా జోసఫ్ జట్లు నిలిచాయి. విజేతలకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు విజయ మనోహరి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ డైరెక్టర్ పాటిల్ హనుమంతరెడ్డి, కార్పొరేటర్లు నారాయణ రెడ్డి, రాజేశ్వరరెడ్డి, సర్వేశ్వరరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్
కబ్జా,బలగం,దాస్ కా ధమ్కీ,రంగమార్తండ
జాన్ విక్ చాప్టర్–4
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్
కబ్జా,ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి,
దాస్ కా ధమ్కీ,రంగమార్తండ,ఖోస్టీ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సార్,దాస్ కా ధమ్కీ
ఐనాక్స్
తూ జూతీ మై మక్కర్, షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్, జాన్ విక్ చాప్టర్–4,
రాజ్ :ఖోస్టీ
శ్రీరామ:షాజమ్ ఫరీ ఆఫ్ ది గాడ్స్

ఆపరేషన్ థియేటర్ సిబ్బందిపై ఆగ్రహం


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏ, బీ ఆపరేషన్ థియేటర్‌లో పరికరాలను అదనంగా నిల్వ ఉంచడంపై హెడ్‌నర్సు, నర్సింగ్ సిబ్బందిపై ఆసుపత్రి అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేశారు. అక్కడ సర్జికల్ ఎక్విప్‌మెంట్ స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించగా అదనంగా నిల్వ ఉంచినట్లు తేలింది. దీంతో హెడ్ సిస్టర్, నర్సింగ్ స్టాఫ్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ విషయమై విచారణకు ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే నర్సింగ్ సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనంగా ఉన్న పరికరాలను వెంటనే స్టోర్‌కు పంపించాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని ప్రతి ఆపరేషన్ థియేటర్‌ను మూడు రోజులకు ఒకసారి తనిఖీ చేయాలని నర్సింగ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బహుమతుల పంపిణీ


విజేతలకు బహుమతులను అందజేస్తున్న సెక్రటరీ గోవిందు

కర్నూలు(అగ్రికల్చర్): ఉగాది సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ఒంటెద్దు గిరక బండ్ల పోటీల విజేతలకు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు గురువారం బహుమతులు అందజేశారు. మొత్తం 14 ఎద్దులు పోటీ పడగా ఎస్.రఫీక్‌కు చెందిన ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచి రూ.31 వేలు గెలుచుకుంది. వి.సుబ్బరాయుడుకు చెందిన ఎద్దు రెండవ స్థానంలో నిలిచి రూ.25 వేల నగదు దక్కించుకుంది. వి.రామాంజనేయులుకు చెందిన ఎద్దు 3వ స్థానంలో నిలిచి రూ.7,116 నగదు బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ...మార్కెట్ యార్డులో ఒంటెద్దు బండ్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐకమత్యంగా గిరక బండ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు, ఒంటెద్దు బండ్ల అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ చౌదరి, సెక్రటరీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

రేపు సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్: శ్రీరామ కల్యాణ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 25న రాత్రి 7 గంటలకు స్థానిక దామోదర సంజీవయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.క్రిష్టన్న, గోరంట్ల రమణ తెలిపారు. గురువారం బుధవార పేటలోని కేశవ మెమోరియల్ పాఠశాలలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ నవమిని పురస్కరించుకుని నగరంలోని పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయం నుంచి మొదటి ఊరేగింపు, బళ్లారి చౌరస్తా నుంచి రెండో ఊరేగింపు, కల్లూరు ఎస్టేట్ నుంచి మూడో ఊరేగింపు, నంద్యాల చెక్‌పోస్ట్ నుంచి నాలుగో ఊరేగింపు బయలుదేరి శోభాయాత్రగా కల్యాణోత్సవ వేదికకు చేరుకుంటాయన్నారు. 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6 గంటలకు ధార్మిక ప్రవచనం, 7 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు. ఉత్సవ సమితి సభ్యులకు శోభాయాత్రకు సంబంధించిన జెండాలు, కండువాలు, కాషాయం టోపీలు పంపిణీ చేశారు.

క్రీడాకారులకు అభినందన


హ్యాండ్‌బాల్ క్రీడాకారులు అభినందిస్తున్న దృశ్యం


ఫుట్‌బాల్ క్రీడాకారిణిని అభినందిస్తున్న సంఘం ప్రతినిధులు

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గురువారం పలువురు అభినందించారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కర్నూలు డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉదయ్, జగదీష్, మహేష్, రాజ్‌కుమార్‌లు ప్రతిభ కనబరిచి 27 నుంచి 31 వరకు రాజస్తాన్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మల్లారెడ్డి ఇన్‌ఫ్రా సంస్థ కార్యాలయంలో జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి, కళాశాలలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరరావు అభినందించారు. అలాగే యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఈఈఈ మూడో ఏడాది చదువుతున్న లక్ష్మీపురం గ్రామానికి చెందిన త్రివేణి ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి 25 నుంచి గోవాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడాకారిణిని ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షులు రాజశేఖర్, చీఫ్ కోచ్ రాజు తదితరులు అభినందించారు.

29న కబడ్డీ పోటీలు

కర్నూలు (న్యూటౌన్): శ్రీరామ నవమి సందర్భంగా ఈ నెల 29, 30వ తేదీల్లో కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యురాలు కె.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు, ఐదవ బహుమతి రూ.6 వేలు, ఆరో బహుమతి రూ.4 వేలు అందజేస్తారన్నారు. కబడ్డీ పోటీల్లో పాల్గొనదలచిన జట్లు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 99896 42989 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్

17 వాహనాలు సీజ్

కర్నూలు: నిబంధనలు ఉల్లంఘించి మైనర్ డ్రైవింగ్‌కు పాల్పడిన 17 వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన రహదారుల్లో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 17 వాహనాలను స్వాధీనం చేసుకుని మైనర్ డ్రైవింగ్ చేసినవారితో పాటు తల్లిదండ్రులను కొత్తపేట పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

అవీ–ఇవీ

రేపు ఈసీటీ వర్క్‌షాప్

కర్నూలు(హాస్పిటల్): నగర శివారులోని పెంచికలపాడులో ఉన్న విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఈనెల 25న ఈసీటీ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కళాశాల ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శివశంకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైకియాట్రీ, కర్నూలు సైకియాట్రీ సొసైటీ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. మానసిక వైద్యంలో అందించే ఎలక్ట్రిక్ షాక్ సంబంధించి ఇందులో పీజీలు, సీనియర్ రెసిడెంట్లు, సైకియాట్రిస్టులకు శిక్షణ ఇస్తామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ప్రముఖ సైకియాట్రిస్టులు హాజరై వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తారన్నారు.

26న దయాల్బాగ్ వస్తు ప్రదర్శన

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని బీఏఎస్ కళ్యాణ మండపంలో ఈనెల 26 న దయాల్బాగ్ వస్తు ప్రదర్శన అమ్మకం నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ డాక్టర్ కె.భాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో తయారైన వస్తు ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉత్పత్తి ధరలకే విక్రయించనున్నట్లు చెప్పారు. ఇందులో దయాల్బాగ్, దాని అనుబంధ సంస్థల్లో తయారైన దుస్తులు, బ్యాగులు, సబ్బులు, అగరబత్తులు, ఆయుర్వేద మందులు తదితరాలు విక్రయిస్తామన్నారు.

30న శ్రీరామ నవమి వేడుకలు

కర్నూలు కల్చరల్: అశోక్‌నగర్‌లోని ప్రసన్న ఆంజనేయ స్వామి ద్వారకామాయి సాయిబాబా దేవస్థానంలో ఈనెల 30న శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సీతారాముల వారికి అభిషేకం, 10 గంటలకు సీతారాముల కల్యాణం, రాత్రి 8 గంటలకు పల్లకీ సేవ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

‘ఫ్యామిలీ ఫిజీషియన్’ పేదలకు వరం


సిబ్బందితో డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదలకు వరమని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య అన్నారు. గురువారం ఆయన నగర శివారులోని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారి, ఆరోగ్యసిబ్బందికి కేటాయించిన గ్రామాన్ని సందర్శించి ఉదయం హెల్త్ క్యాంపులో ఆరోగ్యపరీక్షలు నిర్వహించి చికిత్స చేయాలన్నారు. మధ్యాహ్నం దీర్ఘకాలిక వ్యాధి ఉన్నవారికి, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్ద వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమం గురించి ముందు రోజే ఆశా, ఆరోగ్య కార్యకర్తలు తెలిజేయాలన్నారు. అనంతరం ఆయన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. ముక్తార్ పాషా పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయసాధనకు కృషి


అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు


బి.క్యాంప్ ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహంలో నినాదాలు చేస్తున్న నేతలు

కర్నూలు(సెంట్రల్): దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. గురువారం వారి వర్ధంతిని పురస్కరించుకుని పలు చోట్లా వారి చిత్ర పటాలకు నివాళులర్పించారు. కర్నూలు మండలం ఉల్చాలలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, జొహరాపురం షరీక్ కాలనీలో ప్రజా సంఘాలు, ముజఫర్ నగర్ గ్రంథాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు నాగరాజు, విజయ్, సుధాకరప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు రంగన్న, డీవైఎఫ్ఐ నాయకులు నగేష్, హుస్సేన్‌బాషా పాల్గొని అమరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు.

కర్నూలు(అర్బన్): భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. బీ.క్యాంప్‌లోని ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్, నగర కోశాధికారి అశోక్, నాయకులు హరి, సూర్య, పురుషోత్తం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

– **కర్నూలు కల్చరల్:** స్థానిక సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు ఎల్లా కృష్ణ, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి రెండు సీట్లే

కర్నూలు(రాజ్‌విహార్): శాసనమండలి ఎన్నికల్లో లబ్ధి కోసం ఇద్దరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన టీడీపీ.. వచ్చే ఎన్నికల్లో రెండు స్థానాలకే పరిమితమవుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య జోస్యం చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు తమ పార్టీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారని, దీంతో 2019 ఎన్నికల్లో 23 స్థానాల్లోనే గెలుపొందారన్నారు. తాజాగా మండలి ఎన్నికల్లో ఇద్దరినీ కొనుగోలు చేశారని, 2024లో రెండు సీట్లతోనే సరిపెట్టుకుంటారని అన్నారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని, గతంలో తెలంగాణలో ఇలా కొనుగోలు చేస్తూ ఓటుకు నోటు కేసులో ఇరుక్కుపోయారని గుర్తు చేశారు.

విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు చర్యలు


విద్యార్థికి మాత్ర మింగిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆయన మిలటరీ కాలనీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయమ్మ, సచివాలయ ఆరోగ్య కార్యకర్త అనిత, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

శ్రీరామ చరిత్ర జగతికి స్ఫూర్తి


మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

కర్నూలు కల్చరల్: శ్రీరామచంద్రుని చరిత్ర సమస్త మానవాళికి ఆదర్శమని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో శ్రీమద్రామాయణ సప్తాహం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ చరిత్ర జగతికి స్ఫూర్తి అన్నారు. మొదటి రోజు శ్రీరామనవమి విశిష్టతపై విశ్రాంత మండల విద్యాశాఖాధికారి, ధార్మిక ప్రవచకులు ఇల్లూరి నాగరత్నం శ్రేష్టి ఉపన్యసించారు. కార్యక్రమంలో దేవస్థానం భజన మండలి అధ్యక్షులు మల్లేష్, సభ్యులు రాధాకృష్ణ మోహన్‌రావు, నరసప్ప, నరేష్, దాసు, అర్చకులు క్రమధాటి గిరీశ్వర శర్మ పాల్గొన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: మండల పరిధిలోని సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 2,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, కేసీ కాల్వకు 2,265 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుర్జీత్‌కు ఘన నివాళి



సుర్జీత్ చిత్ర పటం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సుర్జీత్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ నాయకులు ఎస్‌పి సుభాన్, రాజగోపాల్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. సుర్జీత్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ మాట్లాడుతూ దేశం సుర్జీత్‌సింగ్ చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందన్నారు.